
సాక్షి చిత్తూరు

సోమవారం । 29 । జూలై । 2024



భక్తజన సంద్రమైన బోయకొండ

బోయకొండ గంగమ్మను రికార్డు స్థాయిలో 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. - 8లో



ఆరు దశాబ్దాల స్నేహ పరిమళం

చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో 1965–66లో వారంతా ఎస్‌ఎస్‌ఎల్‌సీ చదివారు. ఆరు దశాబ్దాల అనంతరం కలిశారు. - 8లో



దర్గాగా 'మాన్యం' కబ్జా

కోట్లాది విలువైన మాన్యం భూమిని కబ్జా చేసి రియల్ వ్యాపారానికి తెరతీశారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. - 8లో

న్యూస్‌రీల్

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివయ్య

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణను బహిష్కరించారంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మరాదని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సూర్యనారాయణను బహిష్కరించామంటూ ఆస్కారరావు చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధమని, అంతా అసత్య ప్రచామని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కారరావు అసోసియేషన్ నియమాలు అతిక్రమించారని ఈ నెల 22న రాష్ట్ర స్థాయి సమావేశంలో అతడిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తొలగింపబడిన ఆయన వెంట ఏ ఒక్క జిల్లా ఉద్యోగులూ లేరని, అయితే ఆయన అసోసియేషన్‌కు నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ప్రకటించుకోవడం హాస్యాస్పదమన్నారు. తామంతా సూర్యనారాయణ వైపే ఉంటామని తేల్చి చెప్పారు. ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు అసత్య ప్రచారాలను నమ్మరాదని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి, సహాధ్యక్షులు బాలాజీరెడ్డి, కోశాధికారి దేవకుమార్, నాయకులు సురేంద్రనాథ్, సురేష్‌బాబు, శ్రీనివాసమూర్తి, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వ్ (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

3,731 విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలో ఉన్న 3,731 విద్యుత్ సర్వీసులను శనివారం రాత్రి సిబ్బంది తనిఖీ చేశారని ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఇందులో తిరుపతి ఆపరేషన్‌లో 97, తిరుపతి రూరల్‌లో 56, పుత్తూరులో 84, చిత్తూరు అర్బన్‌లో 84, చిత్తూరు రూరల్‌లో 37, మదనపల్లెలో 79, పీలేరులో 63, పుంగనూరు పరిధిలో 97 కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. విద్యుత్ అదనపు లోడ్, చౌర్యం కేసులు ఉన్నాయని, మొత్తం రూ.12.19 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు తెలియజేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు కచ్చితంగా పాల్గొనాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఇన్‌చార్జి ఏఈల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ పనుల్లో భాగంగా 2019–20 నుంచి వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయకపోవడంతో పెనుమూరు ఏఈ నీరజ, తిరుపతి జిల్లా అవిలాల ఏఈ నాగరాజును తాత్కాలికంగా విధుల నుంచి పక్కన పెట్టారు. ఆ స్థానంలో పెనుమూరు సెక్షన్ సబ్ ఇంజినీర్ తులసి, తిరుపతి ఆపరేషన్ సెక్షన్ ఏఈ శ్రీనివాసులునాయుడుకు ఇన్‌చార్జిలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 84,173 మంది స్వామివారిని దర్శించుకోగా 32,519 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



మీ భూమి.. ఇక బాబుదే!

ఇక పేదల భూములన్నీ చంద్రబాబువే.. అధికారం వచ్చీ రాగానే కూటమి ప్రభుత్వం పంజా విసిరింది. ప్రజల భూములు లాక్కోవడానికి పక్కా స్కెచ్ వేసింది. ముందుగా ప్రజల భూ రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా మార్పులు చేస్తోంది. ఆ తరువాత ప్రభుత్వ భూమిని పేదలే కబ్జా చేశారని ముద్ర వేస్తుంది. గతంలో ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగినా, ఎన్ని పత్రాల ఆధారాలున్నా, ఆ రికార్డులు తారుమారు చేసేందుకు సిద్ధమైంది. ప్రస్తుతానికి 982 ఎకరాలకు సంబంధించిన రికార్డులను ప్రభుత్వ భూములుగా మార్చేసింది. ఇవన్నీ బ్రిటీషు కాలం నాటి నుంచి ప్రైవేటు వ్యక్తుల మీద రిజిస్టరవుతూ వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హఠాత్తుగా ఇవన్నీ ప్రభుత్వ భూములుగా మారిపోయాయి. అయితే ఈ భూములకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదం కేసుకు లింకు పెట్టి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కక్ష సాధింపులకు దిగుతున్నారు. ఈ భూములు పుంగనూరు మండలం రాగానిపల్లె సమీపంలో ఉన్నాయి. ఈ భూములకు సంబంధించిన రికార్డులన్నీ చిత్తూరు కలెక్టరేట్‌లో భద్రంగా ఉన్నట్లు తేలడం కొసమెరుపు.

- 982.48 ఎకరాలపై టీడీపీ పంజా
- బ్రిటీష్‌కాలం నాటి రికార్డులు తారుమారు
- నాడే రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు ఆధారాలు
- భూములన్నీ అనాధీనం కింద మార్చేసిన కూటమి ప్రభుత్వం
- ఆ నిందలన్నీ మాజీ మంత్రి కుటుంబంపై వేస్తున్న వైనం
- ప్రభుత్వ నిర్వాకంతో విస్తుపోతున్న రెవెన్యూ యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడవక ముందే రెవెన్యూ రికార్డులను మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వెబ్‌ల్యాండ్ పేరుతో అనేక అక్రమాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆ అక్రమాలను వెలికి తీసేందుకు రీ సర్వేకు శ్రీకారం చుట్టింది. అయితే పూర్తిగా చేస్తే తాను దోచుకున్న భూముల చిట్టా వెలుగులోకి వచ్చేస్తుందని భయపడ్డ చంద్రబాబు నాయుడు దాన్ని అడ్డుకోవడానికి నానాపాట్లు పడ్డారు. అందుకే ఇప్పుడు ఆ రీ సర్వేని కొనసాగించే సాహసం చేయలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. పేదల భూములను దోచుకునేందుకే చంద్రబాబు వెబ్‌ల్యాండ్‌ను ప్రవేశపెట్టారని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఆ వెబ్‌ల్యాండ్ మాంత్రికుడు చంద్రబాబు అధికారంలోకి రాగానే తన పాత అనుభవాలకు పని పెడుతున్నారు. వెబ్‌ల్యాండ్‌లో కిటుకులు తెలిసిన చంద్రబాబు తిరిగి అక్రమాలకు తెరలేపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పుంగనూరు మండలం రాగానిపల్లె భూములపై కన్నేశారు. రాగానిపల్లె గ్రామ దాఖలా సర్వే నంబరు 22లో ఉన్న 982.48 ఎకరాల భూమి పూర్తిగా ప్రైవేటు భూమి అని, అది ప్రభుత్వ భూమి కాదని బ్రిటిష్, జమీందారి కాలం నాటి రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల నాటి రెవెన్యూ రికార్డులలో ఆ 982.48 ఎకరాలు రైత్వారీ భూమిగా ఉంది. కూటమి సర్కారు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాగానిపల్లె భూములపై అసత్య ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. తమకు అనుకూలమైన పత్రికల్లో రైతుల భూములను ప్రభుత్వ భూములుగా చెప్పించి అసత్య కథనాలను ప్రచురిస్తున్నారు. వారి ధోరణి చూసి, చుట్టుపక్కల ఉన్న రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు రెవెన్యూ అధికారులు ఈ రికార్డుల మార్పులతో తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే..

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇప్పుడు హఠాత్తుగా ఈ భూములన్నీ అనాధీనంగా మారిపోయాయి. రెవెన్యూ రికార్డులన్నీ తారుమారైపోయి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా చూపుతున్నాయి. దీన్ని సాక్ష్యంగా తీసుకుని టీడీపీ, అనుకూల పత్రికలు అది ప్రభుత్వ భూమి అంటూ ప్రచారం చేస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ, కొన్నేళ్ల నుంచి తమ అనుభవంలో ఉన్నప్పటికీ రైతులకు ఆ భూములు చెందకుండా పోయాయి. ఈ భూములను వీలైనంత త్వరగా స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తుండడం గమనార్హం.

రికార్డులు ఏం చెబుతున్నాయంటే..

రాగానిపల్లెలో గల భూములను తొలుత పుంగనూరు జమీందారు మహదేవరాయులు, శంకర్‌రాయులుకు జమీందారి పట్టా నంబరు 20గా మంజూరు చేశారు. సదరు భూమిని 1907లో మహదేవరాయులు తల్లి సావిత్రమ్మకు భాగపరిష్కార పత్రం ద్వారా సంక్రమించింది. 1943లో ఆమె తన ఆస్తులను కుమారుడైన మహదేవరాయులుకు రిజిస్టర్డ్ వీలునామా ద్వారా కేటాయించారు. దీనిపై సర్వే సెటిల్‌మెంట్ అధికారులు ప్రీ ఎస్టేట్ అబాలిష్ రికార్డులను పరిశీలించి మహదేవరాయులు కుమారుడైన శంకర్‌రాయులుకు 27–02–1958న రఫ్ పట్టా మంజూరు చేశారు. ఈ సమయంలో ఉన్న పైమాషి నంబరు: 25, 26, 27, 28ని మార్పు చేస్తూ సర్వే నంబరు 22గా, పట్టా నంబరు 300 గా మంజూరుచేశారు. దీనిపై ఆనాటి సర్వే సెటిల్‌మెంట్ అధికారులు గ్రామంలో పూర్తి విచారణ నిర్వహించారు. విచారణలో అభ్యంతరాలను ఇటు ప్రభుత్వం నుంచి అటు ప్రజల నుంచి లేకపోవడంతో ఎస్టేట్ అబాలిష్ యాక్ట్ 1948, సెక్షన్ 11ఎ కింద రైతు వారీ పట్టా మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీనిని బట్టి ఆ భూమి ప్రైవేటు భూమిగా రైత్వారి పట్టాగా నిర్ధారణ అయింది.

అన్నింటికీ పెద్దిరెడ్డి కుటుంబమే కారణమట!


ఇటీవల మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి కొన్ని ఫైళ్లు కాలిపోయాయి. అయితే ఆ షార్ట్‌సర్క్యూట్ ఉద్దేశపూర్వకంగా రాగానిపల్లె భూములు కాపాడుకునేందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేయించారంటూ కట్టుకథలు అల్లేశారు. వాటికి టీడీపీ అనుకూల పత్రికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. వాస్తవానికి రాగానిపల్లె భూముల రికార్డులు పలమనేరు రెవెన్యూ డివిజన్, చిత్తూరు కలెక్టరేట్‌లో ఉంటాయి. అధికారాన్ని వినియోగించి రాగానిపల్లె ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూములంటూ వెబ్‌ల్యాండ్‌లో తారుమారు చేయించి, దాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై వేసేందుకు అధికార పార్టీ కుట్రలు చేస్తోందనడానికి ఇదే నిదర్శనం.

ఎన్ని సార్లు సర్వే చేసినా అదే పట్టా

రాగానిపల్లెకు చెందిన 982.48 ఎకరాల భూమిపై మల్లుపల్లికి చెందిన వెంకటస్వామి, రెడ్డెప్పరెడ్డి కలసి శంకర్‌రాయులు ద్వారా రిజిస్టర్డ్ కొనుగోలు చేసుకున్నారు. 1964లో సదరు వ్యక్తుల కుమారులు అగస్తిరెడ్డి, మునెప్ప, చిన్నప్ప రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటస్వామి మైనర్ గార్డియన్లుగా కొంత భూమిని, చెన్నకేశవరెడ్డి కుమారుడు ఎల్.మాధవరెడ్డికి విక్రయించారు. 1966లో మిగిలిన అర్ధ భాగాన్ని కూడా రెడ్డెప్పరెడ్డి మాధవరెడ్డికే విక్రయించారు. సదరు ఎల్.మాధవరెడ్డి ఈ భూములను పలువురికి విక్రయించారు. దీనిపై 1971లో అప్పటి చిత్తూరు కలెక్టర్ విచక్షణా అధికారంతో సదరు భూములకు రైతు పట్టాను రద్దు చేయాలని నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారిని కోరారు. అయితే 1958లో పట్టాను మంజూరు చేసినందున ఆ పట్టా రద్దు చేసే అధికారం తనకు లేదని దీనిపై నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారి తేల్చిచెప్పేశారు. అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని లేఖ పంపారు. దీనిపై పలుమార్లు నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారి ఇది రైతు పట్టాగా నిర్ధారించి, కలెక్టర్‌కు ఉత్తర్వులు పంపారు.



చిత్తూరు జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు



కలెక్టరేట్‌లోని పాత రికార్డుల ఆధారం

పునఃవిచారణలోనూ ప్రైవేటు భూములుగానే



రాగానిపల్లె సమీపంలోని భూములు

హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ స్వీయ పరిశీలనలో కేసును 1973లో విచారణ చేపట్టారు. ఆ విచారణలో రెండు కారణాలను చూపుతూ 1977లో పట్టా రద్దు చేశారు. 1978లో సదరు ఉత్తర్వులపై రైతులు కమిషనర్ సర్వే సెటిల్ మెంట్ వారి ఎదుట రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. సదరు పిటిషన్‌ను కమిషనర్ ఆలస్యంగా దాఖలు చేశారని తిరస్కరించారు. దీనిపై రైతులు 1978లో హైకోర్టును ఆశ్రయించగా, 1980లో హైకోర్టు సర్వే సెటిల్‌మెంట్ అధికారుల ఉత్తర్వులను రద్దు చేస్తూ సదరు భూములపై రైతుల హక్కు, అనుభవం ఉన్నందున దీనిపై సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ హైదరాబాద్ పునర్విచారణ చేయాలని ఆదేశించింది. 2006లో కమిషనర్ తన తీర్పులో 1977 డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ ఇచ్చిన తీర్పు సరిలేదని, పట్టా ఇచ్చిన 20 ఏళ్ల తరువాత కేసును స్వీయ పరిశీలనకు తీసుకునే అధికారం లేదని తీర్పు వెలువరించారు. తిరిగి దీనిని పునఃపరిశీలన చేయమని డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్‌ను ఆదేశించారు. దీనిపై 2022లో సదరు డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ వారు తీర్పును ప్రకటించి, 1958లో రైతులకు ఇచ్చిన పట్టా ప్రక్రియ పూర్తయ్యిందా, లేదా? తేల్చమని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై సదరు జిల్లా జాయింట్ కలెక్టర్ 25–03–2023న రైతులకు ప్రీ అబాలిషన్ కాలం రికార్డులు, రిజిస్టర్డ్ పత్రాలు, 1958లో సర్వే సెటిల్‌మెంట్ అధికారులు మంజూరు చేసిన రఫ్ పట్టా, పట్టాను ఆమోదిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డులు ఎస్‌ఎల్‌ఆర్, ఎఫ్‌ఎల్‌ఆర్‌లను పునఃపరిశీలన చేశారు. 66 సంవత్సరాల క్రితం సదరు భూమికి రైత్వారీ పట్టా మంజూరు చేశారని, ఇందులో తాను చేయాల్సింది ఏమి లేదని జాయింట్ కలెక్టర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ భూమికి సంబంధించిన రికార్డులు అన్నీ భద్రంగా సర్వే సెటిల్‌మెంట్ ఆఫీసులో ఉన్నాయని తేల్చిచెప్పారు. ఇలా పునఃవిచారణ చేయగా రాగానిపల్లె సర్వే నంబర్ 22 లోని 982.48 ఎకరాల భూమి ప్రైవేటు భూములుగా తేల్చేశారు.



ఆ భూముల్లో సాగవుతున్న మామిడితోట

గం'జాయ్'
ఇచ్ఛాపురం టు బెంగళూరు!

- గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణా
- వివిధ వాహనాల్లో కర్ణాటకకు..
- జిల్లాలో ఇప్పటికి పట్టుబడిన సరుకంతా ఇచ్ఛాపురం నుంచే..!





ఇచ్ఛాపురం ప్రాంతం నుంచి బెంగళూరుకు ప్యాకింగ్‌లో స్మగ్లింగ్ అయ్యే గంజాయి(ఫైల్)

పలమనేరు: ఇచ్ఛాపురం నుంచి బెంగళూరుకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అక్రమరవాణా జోరుగా సాగుతోంది. కొంతకాలంగా జిల్లాలో పోలీసులకు పట్టుబడిన నిందితులు విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులే కాకుండా ఒడిశా రాష్ట్రంలో బరంపురం ప్రాంతాలకు చెందిన వారే. కొంతకాలంగా రకరకాల వాహనాల్లో గంజాయిని కర్ణాటకకు చేర్చే ముఠాలు తమ పంథా మార్చుకున్నాయి. వాహనాల్లో కాకుండా బైక్‌లపై సైతం గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నాయి. తాజాగా కొందరు బీటెక్ విద్యార్థులు బైక్‌లపై విశాఖపట్నం నుంచి ఇక్కడికి గంజాయిని తరలిస్తూ స్థానిక సెబ్ అధికారులకు రెండ్రోజుల క్రితం పట్టుబడటం సంచలనం కలిగించింది. దీన్ని బట్టి చూస్తుంటే స్థానికంగా గంజాయి వ్యాపారం ఎంతగా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

ఏమాత్రం అనుమానం రాకుండా..

అంబులెన్స్‌లో అత్యవసర రోగులకు తీసుకెళ్తున్నట్టు పోలీసులను బురిడీ కొట్టించి గతంలో గంజాయి రవాణాకు యత్నించారు. అప్పట్లో గంగవరం పోలీసుల తనిఖీల్లో ఇది బట్టబయలైంది. అలాగే రెండేళ్ల క్రితం బొలెరో, ట్రాక్టర్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో బొలెరోలో గంజాయి రవాణా బాగోతం బయటపడింది. వాహనంలోని సీట్లకింద, బ్యానెట్, ఇంజిన్‌లో కనిపించకుండా గంజాయి ప్యాకెట్లను తీసుకెళ్తున్నట్లు పలమనేరు పోలీసులు గుర్తించారు. ఇచ్ఛాపురం గంజాయికి బెంగళూరులో భారీ డిమాండ్ ఉండడంతోనే స్మగ్లర్లంతా బెంగళూరు బాటపట్టినట్టు తెలుస్తోంది.

అలవాటు పడిన వారికోసం..

బెంగళూరు మహానగరంలో పబ్ కల్చర్‌కు అలవాటుపడిన వారిని టార్గెట్‌గా చేసుకుని బెంగళూరుకు చెందిన కొన్ని ముఠాలు అక్కడి వారికి ఎక్కువ ధరకు గంజాయిని డోర్ డెలివరీ చేస్తున్నట్టు సమాచారం. ఫలితంగా డిమాండ్ ఎక్కువ కావడంతో ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన ముఠాలు ఇటీవల కాలంలో ఎక్కువగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్టు కర్ణాటక పోలీసులు చెబుతున్నారు. పలమనేరు సమీపంలోని మొగిలిఘాట్ వరకు వాహనాల్లో గంజాయిని తరలించి అక్కడి నుంచి ద్విచక్ర వాహనాల్లో సైతం అడ్డదారుల గుండా కర్ణాటకలోకి తరలిస్తున్నట్టు సమాచారం. ఏదేమైనా జిల్లా పోలీసు యంత్రాంగం గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

పోలీసుల కళ్లు గప్పి..!

ఇచ్ఛాపురం నుంచి పలురకాల వాహనాల్లో 25 గంటలపాటు ప్రయాణించి బెంగళూరుకు గంజాయిని చేర్చుతున్నారు. దాదాపు 1,264 కిలోమీటర్లు వీరు అత్యంత జాగ్రత్తగా తమ నెట్‌వర్క్ సాయంతో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు సమాచారం. ఇచ్ఛాపురం నుంచి 16వ నంబరు జాతీయ రహదారి మీదుగా నెల్లూరు, తిరుపతి బైపాస్, చిత్తూరు బైపాస్, పలమనేరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోకి అక్రమ రవాణా సాగుతోంది. ఈ మార్గంలో ముఖ్యమైన చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలున్నప్పటికీ గంజాయి అక్రమ రవాణా సాగుతుండటం గమనార్హం. సంబంధిత ప్రాంతాల్లోని స్థానికులను తమ ఏజెంట్లుగా పెట్టుకుని ఈ దందా సాగిస్తున్నట్టు తెలిసింది. వీరు ఆయా ప్రాంతాల్లో వాహనం సురక్షితంగా దాటేదాకా బాధ్యులుగా ఉంటారని మొత్తం సెల్‌ఫోన్లతోనే వ్యవహారాలు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇందుకుగాను ఆ ఏజెంట్లకు గూగుల్‌పే, ఫోన్‌పేల ద్వారా నగదు జమ చేస్తుంటారని తెలిసింది.

చిత్తూరులోనూ
విద్యుద్దీకరణ పనులు



ఈఈ, డీఈలతో మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

- ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: స్మార్ట్ సిటీ అయిన తిరుపతి నగరంతో సమానంగా చిత్తూరు కార్పొరేషన్‌లో విద్యుద్దీకరణ పనులు చేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ఈఈ కార్యాలయంలో ఈఈ మునిచంద్ర, డీఈలు పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్, ఏఈలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, చిత్తూరులోని గంగనపల్లె పరిధిలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉండడంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 35 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఎటువంటి విద్యుత్ సమస్యలున్నా 1912 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే గిరింపేట 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కట్టమంచి వరకు విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. ప్రత్యామ్నాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దొడ్డిపల్లె నుంచి కట్టమంచి వరకు 5.4 కిలోమీటర్ల లైన్‌ను రూ.1.28 కోట్లతో వేయనున్నట్లు పేర్కొన్నారు. నగరంలో 16 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 100 కేవీ నుంచి 160 కేవీకి పెంచనున్నట్టు వివరించారు. అదనంగా 20 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె ఎత్తు తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, వాటి ఎత్తు పెంచుతామన్నారు. నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్‌ఐ మార్క్ విద్యుత్ వైర్లు వాడాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం ప్రభుత్వ బకాయిలు రూ.1470 కోట్లు ఉన్నాయని, అందులో పంచాయతీల బకాయిలు రూ.1398 కోట్లు, నగరపాలక సంస్థల్లో రూ.10 కోట్లు, మున్సిపాలిటీల్లో రూ.18 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రులు రూ.3.5 కోట్లు ఉన్నట్టు తెలిపారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఈలు బాలచంద్ర, రాజేంద్రబాబు, కేశవులు, మహమ్మద్‌బాషా, ఈఆర్వో ఎస్‌ఏ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టుడుకుతున్న చంద్రగిరి!

- మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌తో అగ్నికి ఆజ్యం
- అడ్డంకులు దాటి వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఆందోళనలు, ధర్నాలకు వైఎస్సార్‌సీపీ సమాయత్తం
- పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో భారీగా బలగాల మోహరింపు
- 41 నోటీసు ఇచ్చి పంపించేసిన పోలీసులు

తిరుపతి రూరల్: గత రెండు నెలలుగా అధికార పార్టీ శ్రేణుల దాడులు, అక్రమ కేసులు, అల్లర్లు, హత్యయత్నాలు, దౌర్జన్యాలు, వేధింపులతో చంద్రగిరి నియోజకవర్గం అట్టుడికిపోతోంది. నియోజకవర్గంలో గత 56 రోజుల్లోనే దాదాపు 163కు పైగా సంఘటనలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. చంద్రగిరి నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ దాడుల్లో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గాయపడ్డాయి. జేసీబీలను తీసుకువచ్చి మరీ వైఎస్సార్‌సీపీ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పట్టపగలే ఇళ్లు, దుకాణాలను కూల్చివేస్తున్నారు. దౌర్జన్యంగా ఇళ్ల వద్దకే వెళ్లి కత్తులు, రాడ్లతో దాడులు చేస్తున్నారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళితే పోలీసుల సమక్షంలోనే దాడులకు తెగబడుతున్నారు. ప్రజాప్రతినిధి భార్య స్టేషన్‌కు వచ్చి పోలీసులను బెదిరించి మరీ నిందితులను విడిపించుకుని వెళ్తున్నా...పోలీసులు మాత్రం చేష్టలుడిగి చూస్తున్నారు. కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. అంతేకాకుండా దాడులకు తెగబడుతున్న వారికి పోలీసులు కొమ్ముకాస్తున్న వైనంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. ఈ దాడుల్లో మొత్తం 73 మంది బాధితులను ఇప్పటి వరకు గుర్తించారు. వారికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు.

పోలీస్ నిఘా వ్యవస్థ హెచ్చరికలతో..

మోహిత్‌రెడ్డి అరెస్ట్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహంతో ఉండడం, భారీగా స్టేషన్ పరిసరాలకు తరలివచ్చే అవకాశం ఉందని పోలీస్ నిఘా వ్యవస్థ హెచ్చరించింది. దీంతో తిరుపతిలో 144 సెక్షన్ విధించారు. వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే దారుల్లో ఆంక్షలు విధించారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. వందలాది మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసు ఆంక్షలను ఛేదించుకుని మోహిత్‌రెడ్డి స్టేషన్‌కు వచ్చేసరికే వందలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు అక్కడికి చేరుకోవడంపై పోలీసులు ఆశ్చర్యపోయారు. నినాదాలతో స్టేషన్ పరిసరాలు మార్మోగాయి. పోలీసులు సైతం రిమాండ్, జైలు అనకుండా కేవలం 41 నోటీసు మాత్రమే ఇచ్చి మోహిత్‌రెడ్డిని విడుదల చేశారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన మోహిత్‌రెడ్డి వేలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వెనుదిరిగారు. దీంతో పోలీసులు సైతం ఊపిరిపీల్చుకున్నారు.



ఎస్వీయూలో మోహిత్ రెడ్డితో కలిసి పార్టీ శ్రేణుల ర్యాలీ

మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌తో..

ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ వేధింపులు, దాడులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు విసిగిపోయి ఉన్నాయి. అంతలోనే విదేశాల్లో చదువుకుని ప్రజాసేవకు వచ్చిన తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసి వేధిస్తున్న వైనంపై మరింత మండిపడుతున్నారు. మహిళా వర్సిటీలో జరిగిన ఘటనకు సంబంధించి తనకు సంబంధం లేకపోయినా, ఘటన సమయంలో సాక్షాత్తు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారుల సమక్షంలోనే తాను ఉన్నా కూడా రాజకీయ కక్షతోనే ఘటన జరిగిన 52 రోజుల తర్వాత మోహిత్‌రెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. అంతే కాకుండా ఆర్థిక మోసాలకు పాల్పడిన వారికి, దేశద్రోహులకు, అంతర్జాతీయ నేరస్తులకు, ఉగ్రవాదులకు, తీవ్రవాదులకు జారీ చేసే లుక్ అవుట్ నోటీసులు ఇవ్వడం, అర్ధరాత్రి బెంగళూరులో అరెస్ట్ చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్టైంది. అందుకే మోహిత్‌రెడ్డి అరెస్ట్ వార్త వినగానే వేలాదిగా తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీకి తరలివచ్చారు. మోహిత్‌రెడ్డిని జైలుకు పంపితే ధర్నాలు, రాస్తారోకోలు చేసేందుకు సమాయత్తం అయ్యారు.



పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దర్గాగా 'మాన్యం' కబ్జా



ఆలయ స్థలంలో సాగుతున్న నిర్మాణ పనులు, (ఇన్‌సెట్) ఇప్పటికీ అది కోదండరామి స్వామిదేనని ఉన్న రికార్డు

- స్థలంలో రియల్ వెంచర్ వేస్తున్న వైనం!
- పట్టించుకోని అధికారులు

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డుకు ఆనుకుని సాయిబాబా ఆలయం వద్ద నున్న స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయ మాన్యంపై కొందరి కన్ను పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో కొందరు అధికార పార్టీ నేతల సాయంతో మాన్యంను కాజేయాలనే స్కెచ్ వేశారు. ఈ భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.20 కోట్లకు పైగా ఉండడంతో ఎలాగైనా దీనిని కబ్జాకు చేయాలని పక్కాగా ప్లాన్ వేశారు. కొందరు పచ్చ నేతల మద్దతుతో అక్రమార్కులు ఇందులో రాళ్లను నాటి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరదీశారు. శనివారం నుంచి ఏకంగా ఆలయ భూమిలో సిమెంట్ పిల్లర్లను నాటడం మొదలెట్టారు. ఆలయ భూమి కబ్జాపై పత్రికల్లో కథనాలు ప్రచురించినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

పక్కాగా అది రాముల వారిదే

పట్టణంలోని శ్రీ కోదండరామాంజనేయుల ఆలయ అభివృద్ధి, నిత్య కైంకర్యాల కోసం పట్టణానికి చెందిన గిడ్డన్నగారి పెద్దనంజుడప్ప తన సర్వే నంబర్ 376/2లో 8.06 ఎకరాల భూమిలో రోడ్డుకు ఆనుకుని 1.90 ఎకరాలను అప్పటి ఆలయ ధర్మకర్త ఉగ్రాణం నారాయణస్వామి శెట్టికి 1928లో రిజిస్టర్ పత్రం ద్వారా దానం చేశాడు. ఇందుకు 1977లో ప్రభుత్వం ఆ సర్వే నంబర్‌ను 376/2ఏగా సబ్ డివిజన్ చేసి పట్టాను సైతం మంజూరు చేసింది. ఇప్పటికీ రెవెన్యూ రికార్డులో ఆ భూమి శ్రీకోదండరామస్వామి పేరిటే నమోదై ఉంది. ఈ భూమిని స్థానిక కూటమి నేతల సహకారంతో అక్రమార్కులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు.

పాఠశాలల్లో విధిగా ఎకో క్లబ్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా బడుల్లో టీచర్లు, విద్యార్థులు ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నీరు, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ, భూమి, గాలి, ఆహారంపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలని కోరారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి

-మరొకరికి తీవ్రగాయాలు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. గుడిపాల ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపిన వివరాలు..మండలంలోని కట్టకిందపల్లె దళితవాడకు చెందిన చంద్రశేఖర్(51), దినకరన్(39) ద్విచక్ర వాహనంలో ఆదివారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో వెళ్తుండగా సీఎంసీ ఆసుపత్రి వద్ద ఎదురుగా వస్తున్న టీఎస్ 23 సిజె 2692 నంబరు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. దినకరన్‌కు కాళ్లు, చెయ్యి విరగడంతో సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన చంద్రశేఖర్

రైలు ఢీకొని వ్యక్తి ..

శ్రీకాళహస్తి: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్కిట్ కళాశాల వెనుక వైపు ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం .. గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేపోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

భక్తజన సంద్రమైన బోయకొండ

- 35వేలకు పైగా భక్తులు దర్శనం
- కిక్కిరిసిన క్యూలు
- ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసంలో రికార్డు స్థాయిలో 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం తెలిపారు. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు నగలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు ఫలించిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

ఒక్కరోజే రూ.19.91లక్షలు ఆదాయం!

అమ్మవారి ఆలయంలో ఒక్క ఆదివారం రోజే వివిధ సేవా టికెట్ల విక్రయాల పరంగా ఆలయానికి 19,91,510 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ తెలిపారు. గతంలో ఎప్పుడు ఇంత మొత్తంలో సేవా టికెట్ల రూపేణా ఆదాయం రాలేదని, అందరి సమష్టి కృషితో ఇది సాధ్యమైందని సిబ్బందిని ఈఓ అభినందించారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ ,(ఇన్‌సెట్) చౌడేపల్లె బోయకొండలో ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

యువకుడి ఆత్మహత్య

పుంగనూరు: పుంగనూరుకు చెందిన యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. వివరాలు..స్థానిక ఎన్ఎస్.పేటకు చెందిన ఉమాపతి, శ్యామల దంపతుల కుమారుడు శివశంకర్ (29) బెంగళూరుకు పనుల నిమిత్తం వెళ్లాడు. అక్కడ తన సమీప బంధువు హెన్నూరులో ఉన్న విజయ్ ఇంటిలో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలేమిటో పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



శివశంకర్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు..చింతలవీధికి చెందిన రామ్‌చరణ్(19), తన స్నేహితులు సందీప్, ప్రదీప్‌తో కలసి ద్విచక్రవాహనంపై అగస్త్యేశ్వరస్వామి కొండకు వెళ్తుండగా మార్గమధ్యంలోని బండ్లపల్లె క్రాస్ వద్ద వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామ్‌చరణ్ అక్కడిక్కడే మృతి చెందారు. సందీప్, ప్రదీప్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నారు.పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం రామ్‌చరణ్ మృతదేహాన్ని తరలించారు.



మృతి చెందిన రామ్‌చరణ్

పొట్టేళ్ల దొంగను పట్టించినా పోలీసుల చర్యలేవీ?

- 4నెలలు గడుస్తున్నా మీనమేషాలు
- జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని బాధితుని వినతి

చౌడేపల్లె: తన ఇంటి వద్ద పొట్టేళ్ల చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టించినా పోలీసులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆదివారం ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కాటిపేరి పంచాయతీ వడ్డివారిపల్లెకు చెందిన వి.నరసింహులు గొర్రెలు, పొట్టేళ్లు మేపుతూ విక్రయించడమే జీవనాధారం. ఇంటి వద్ద చుట్టూ కమ్మీ ఏర్పాటు చేసి వాటిలో గొర్రెల మందను రాత్రి పూట తోలేవారు. 2024 మార్చి 20న బుధవారం రాత్రి ఆ కమ్మీని కత్తిరించి రూ.90 వేల విలువచేసే రెండు పొట్టేళ్లను ఎవరో పట్టుకుపోయారు. మరుసటి రోజు గురువారం పోలీసులకు చోరీ విషయమై పోలీసులకు బాధితుడి కుమారుడు విశ్వనాథ్ ఫిర్యాదు చేశాడు. మరోవైపు బాధితులే తమ పొట్టేళ్ల కోసం గాలించారు. మార్చి 24న పీలేరు సంతలో తమ పొట్టేళ్లను గుర్తించారు. వాటిని గంగవరం మండలం తాళ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతనితో పాటు సింగిరిగుంటకు చెందిన శ్రీనివాసులు నాయుడుకు చెందిన పొట్టేళ్లు సైతం పట్టుకుని చౌడేపల్లె పోలీసులకు స్వాధీనం చేశారు. అయితే ఇప్పటి వరకు పోలీసులు నిందితునిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇదే విషయమై పలు పర్యాయాలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులను పొట్టేళ్ల దొంగ గురించి ప్రశ్నిస్తున్నా కుంటిసాకులు చెబుతున్నారని బాధితుడు వాపోయాడు. సాక్షాత్తు బాధితులే దొంగను పట్టించినా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా ఎస్పీ అయినా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.



న్యాయం చేయాలని కోరుతున్న బాధితుడు నరసింహులు

ఆరు దశాబ్దాల స్నేహ పరిమళం

- 60 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల ఆనందనందనం

చౌడేపల్లె: చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో 1965-66లో వారంతా ఎస్ఎస్ఎల్‌సీ చదివారు. ప్రస్తుతం వారి వయస్సు 75 ఏళ్లు. కాలగమనంలో వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమ పిల్లలకు పెళ్లిళ్లు చేశారు. మరికొందరి మనవలు, మనవరాళ్లకు సైతం వివాహాలయ్యాయి. మునిమనవలు, మునిమనవరాళ్లతో కాలం గడుపుతున్న ఆ వయోజనులు మళ్లీ తమ బాల్యం జ్ఞాపకాలు పేజీలు తిరగేస్తూ తమ సహచరుల కోసం అన్వేషించారు. ఏడాది పాటు శ్రమించారు. అప్పట్లో చదివిన వందమందిలో అతికష్టం మీద 39మంది వివరాలు సేకరించారు. వృద్ధాప్య సమస్యలు కొంతవరకు ఇబ్బంది పెడుతున్నా తమ సహచరుల్ని చూడాలనే బలీయమైన కోరిక ముందు వాటిని లెక్కచేయలేదు. అందరూ రెక్కలు కట్టుకుని వాలిపోయారు. అరేయ్..ఒరేయ్..ఏమ్మే..అంటూ పలకరింపుల ఆనందానుభూతుల వెల్లువలో తడిసి ముద్దయ్యారు. తాము పారేసుకున్న బాల్యం మిగిల్చిన జ్ఞాపకాల్లోకి విహరించారు. ఆదివారం దీనికి విజయవాణి నగర్ వేదికైంది. దీనికి కర్త, కర్మ, క్రియ అన్నీ నాయుని చంద్రశేఖర్ మూర్తి అయ్యారు. తన స్నేహితుడు కేసీ నాయుడు సహకారంతో అప్పటి తమ ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ మిత్రుల చిరునామాలు సేకరించారు. ఆదివారం అందరూ కలవాలని నిర్ణయించుకున్నారు. కుప్పం, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, కర్నూలు, నెల్లూరు, ప్రొద్దుటూరు..తదితర ప్రాంతాల నుంచి మొత్తం 39మంది పూర్వ విద్యార్థులు వచ్చారు. వీరిలో చాలామంది వివిధ రంగాల్లో ఉద్యోగ విరమణ పొందిన వారే. వీరిలో ఆరుగురు కూడా మహిళలు ఉన్నారు. పరస్పర పరిచయాలయ్యాక తమ గురుదేవులకు, భౌతికంగా లేని సహచరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఛలోక్తులు విసురుకుంటూ రోజంతా సందడి చేశారు. ఆరు దశాబ్దాల 'కాలం' తెచ్చిన మార్పులు, పరిణామాలను అవలోకనం చేసుకున్నారు. ప్రతి ఒక్కరినీ చంద్రశేఖర్ నాయుడు జ్ఞాపిక, శాలువతో సత్కరించి తమ స్నేహ పరిమళాన్ని, ఆత్మీయతను పంచారు. ఇన్నేళ్ల తర్వాత తాము కలవడం చెప్పలేనంత సంతోషానికి గురి చేసిందంటూ అందరూ జ్ఞాపకాలతో రీచార్జ్ అయి సాయంత్రం స్వస్థలాలకు పయనమయ్యారు.



క్లిక్..క్లిక్ : 60 ఏళ్ల తరువాత కలిసి పూర్వ విద్యార్థులు